సాక్షి పశ్చిమగోదావరి

బుధవారం । 13 । సెప్టెంబర్ । 2023



శ్రీవారి ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బివీఆర్ సాయిరామ్ మంగళవారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు.



ముంచెత్తిన వాన

ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. 8లో ▸



దేహదారుఢ్య పరీక్షలు

ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో ఎస్సై అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు కొనసాగాయి. 260 మంది మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. 8లో ▸

న్యూస్‌రీల్

5 మండలాలకు ఈఓపీఆర్‌డీల నియామకం



నియామక పత్రాలు అందచేస్తున్న పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో 5 మండలాలకు కొత్తగా ఈఓపీఆర్‌డీలను నియమించారు. జిల్లాలోని పంచాయతీ సెక్రటరీలు, జిల్లా పరిషత్‌లో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్లకు పదోన్నతి కల్పించామని జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు తెలిపారు. ఇంతవరకూ ఇన్‌చార్జిలున్న 5 మండలాలకు ఈఓపీఆర్‌డీలను నియమించామన్నారు. వీరవాసరం మండలానికి టి.విజయసారథి, ఆకివీడు మండలానికి కె.వెంకట సుబ్బారావు, పాలకోడేరు మండలానికి కె.నాగేంద్రకుమార్, భీమవరం మండలానికి జి.వెంకట నాగేశ్వరరావు, తణుకు మండలానికి ఏఎస్‌ఆర్ కోటేశ్వరరావును నియమించారు. ఈ సందర్భంగా వారికి నియామకాలకు సంబంధించిన పత్రాలను పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు అందించారు.

జిల్లాలో ఐదు జనరిక్ మందుల షాపులు

ఆకివీడు: జిల్లాలో ఐదు జనరిక్ మందుల షాపులను సొసైటీల ద్వారా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతి మంజూరు చేసిందని కోఆపరేటివ్ డివిజనల్ అధికారి రవికుమార్ మంగళవారం చెప్పారు. సొసైటీల ద్వారా రైతులు, స్థానిక ప్రజలకు తక్కువ ధరకు మందులు విక్రయించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. జిల్లాలో మొదటి విడతగా ఆకివీడు రూరల్ బ్యాంక్‌లో, మొయ్యేరు, ఇరగవరం, వెంప, యండగండి సొసైటీల పరిధిలో జనరిక్ మందుల షాపులు నిర్వహిస్తామని చెప్పారు. ఇప్పటికే ఆకివీడు, మొయ్యేరు, ఇరగవరం సొసైటీల పరిధిలో లైసెన్స్‌లు మంజూరయ్యాయని, వెంప, యండగండి సొసైటీల పరిధిలో కెమిస్టు అండ్ డ్రగ్గిస్ట్ శాఖ అనుమతి పొందాలని తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్ష విజయవంతం చేయాలి



అధికారులతో సమీక్షిస్తున్న నోడల్ అధికారి విజయలక్ష్మి

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతమయ్యేలా వైద్యారోగ్య శాఖాధికారులు పనిచేయాలని జగనన్న ఆరోగ్య సురక్ష స్టేట్ నోడల్ అధికారి డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో ఆమె వైద్యారోగ్యశాఖాధికారులతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 15న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రారంభమవుతుందని 15 నుంచి 30 వరకూ గ్రామాల్లో ఇంటింటా సర్వే నిర్వహిస్తామన్నారు. అనంతరం 30 నుంచి గ్రామాల్లో వైద్య క్యాంపులు నిర్వహించి ప్రజలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. జిల్లాలో సర్వే పక్కాగా జరిగేలా వైద్యారోగ్య శాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. మెడికల్ క్యాంపులకు స్పెషలిస్టు వైద్యులను నియమించడం, వైద్య పరీక్షలు అవసరమైన పరికరాలు సిద్ధం చేసుకోవడం, మందులు అవసరమైన మేరకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 20 మండలాల్లోని అన్ని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ అమలయ్యేలా వైద్యారోగ్య శాఖాధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డి.మహేశ్వరరావు, డీఈఓ డాక్టర్ సుధ, డాక్టర్ సుగుణ రాజు, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ కీర్తి, డాక్టర్ రమణ తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్‌లో 17న సంగీత, సాహితీ సమాహారం

తాడేపల్లిగూడెం (టీటీసీ): పట్టణంలోని బీవీఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకుడు బుద్దాల వెంకట రామారావు అధ్యక్షతన కళా కేంద్రంలో ఈ నెల 17 ఆదివారం సాయంత్రం 6 గంటలకు నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహిస్తున్నట్లు కళా కేంద్రం నిర్వాహకులు వెల్లడించారు. ట్రాక్ సింగింగ్‌తో పాటుగా నాట్యాచార్య ఇమంది వెంకట పైడారావు, నాట్యాచారిణి అర్చన (కాకినాడ)చే నృత్య ప్రదర్శన, సభా కార్యక్రమంలో భాగంగా గౌరవ, కళారత్న పురస్కారాలు, ఆర్థిక సత్కారం తదితర కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

వరిలో డ్రోన్ల సాయం

- డ్రోన్లతో పురుగు మందుల పిచికారీ
- రూ.12 లక్షల డ్రోన్‌పై 40 శాతం సబ్సిడీ
- 50 శాతం బ్యాంకు రుణం మంజూరు
- ఉమ్మడి పశ్చిమ గోదావరిలో 40 గ్రూపుల ఎంపిక



ఉండి మండలంలో డ్రోన్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: రైతు సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సాగు ఖర్చులను తగ్గించి వ్యవసాయాన్ని పండుగ చేసే సంకల్పంతో సాంకేతిక సాయం అందిస్తుంది. వరి సాగులో కూలీల కొరత, పెట్టుబడి ఖర్చులు పెరిగి రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతుల కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తూ అండగా నిలుస్తున్నారు. గ్రామాల్లో సైతం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటుచేసి ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచడమేగాక తక్కువ ధరకు రైతులకు విక్రయించే ఏర్పాట్లు చేశారు. వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను సబ్సిడీపై అందిస్తూ రైతులను ఎంతగానో ప్రోత్సహిస్తున్నారు.

5.60 లక్షల ఎకరాల్లో వరిసాగు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 5.60 లక్షల ఎకరాల్లో వరి సాగుచేస్తుండగా ఎక్కువ మంది కౌలు రైతులే. వరిసాగులో కూలీల కొరతను అధిగమించడానికి ఇప్పటికే వరినాట్లు, కోత యంత్రాలతోపాటు, దుక్కుదున్నడం, గట్టు లంకలు వేయడం, వరిగడ్డిని కట్టలు కట్టడం వంటి పనులకు యంత్రాలను ఎక్కువగా ఉపయోగిస్తున్నారు. ట్రాక్టర్లు, వరికోతయంత్రాలు, టార్పలిన్లు, స్ప్రేయర్లు వంటి వాటిని ప్రభుత్వం దాదాపు 40 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తుంది.

లామ్‌ఫామ్‌లో శిక్షణ :

డ్రోన్ల వినియోగానికి ప్రత్యేక శిక్షణ అవసరం. విమానాలు ప్రయాణించే ప్రాంతాల్లో డ్రోన్లను వాడితే విమాన ప్రయాణానికి ఇబ్బందులుంటాయి. అందువల్ల డ్రోన్లు నిర్వహించేవారికి సివిల్ ఏవియేషన్ అనుమతి తప్పనిసరి. దీంతో డ్రోన్స్ వినియోగంపై రైతు గ్రూపులో ఒకరికి లామ్‌ఫామ్‌లో ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 29 గ్రూపులను ఎంపిక చేయగా వారికి శిక్షణ కూడా పూర్తయ్యింది. డ్రోన్ సహాయంతో ఎకరం విస్తీర్ణంలో కేవలం 10 నిమిషాల్లో పిచికారీ చేయొచ్చు. డ్రోన్ వల్ల సమయం, సొమ్ము ఆదా కావడమేగాక పురుగుల మందు కూడా దుర్వినియోగం కాదు.

సబ్సిడీపై డ్రోన్లు

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు మరింత అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం డ్రోన్లతో పైరుపై పురుగుమందులు పిచికారీకి కార్యాచరణ రూపొందించింది. ఒక పంట కాలంలో ఎకరం విస్తీర్ణంలో పురుగు మందు స్రేయర్లతో పిచికారి చేయాలంటే దాదాపు రూ.3 వేలకు పైగా ఖర్చవుతుంది. అదే డ్రోన్ సహాయంతో చేయిస్తే కేవలం రూ.1,350కే పూర్తవుతుంది.

40 శాతం ప్రభుత్వ రాయితీ

డ్రోన్ ఖరీదు సుమారు రూ.12 లక్షలు కాగా దీనిలో ప్రభుత్వం 40 శాతం రాయితీ ఇస్తుంది. 50 శాతం బ్యాంకు రుణం ఇస్తారు. ఐదుగురు రైతులు ఒక గ్రూప్‌గా ఏర్పడి కేవలం 10 శాతం సొమ్ము చెల్లిస్తే సరిపోతుంది.

సాగు ఖర్చు తగ్గుతుంది



వరి సాగులో డ్రోన్ల వినియోగం వల్ల సాగు ఖర్చు తగ్గుతుంది. వరిపైరుపై పురుగుమందులు స్ప్రేయర్‌తో పిచికారి చేయించడం వల్ల కొన్ని ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. డ్రోన్ల వల్ల అలాంటి ఇబ్బందులుండవు. సాగు ఖర్చు, సమయం ఆదా అవుతుంది. డ్రోన్ల నిర్వహణకు ఇప్పటికే శిక్షణ అందించారు.

– జెడ్. వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

కూలీల కొరతకు చెక్



వరిసాగులో డ్రోన్ల వినియోగం ద్వారా కూలీల కొరత లేకుండా ఉంటుంది. పైరుపై పురుగుమందు పిచికారీకి ఇద్దరు మనుషుల అవసరమవుతుంది. దీనివల్ల ఖర్చు పెరిగి ఇబ్బందులకు గురవుతున్నాం. డ్రోన్ల ద్వారా పిచికారి చేయిస్తే త్వరగా పని చేసుకోవచ్చు. డ్రోన్ల సేవలు రైతులందరికీ అందుబాటులోకి వచ్చేలా వ్యవసాయశాఖాధికారులు కృషిచేయాలి.

– కె.సత్యనారాయణ, రైతు, పంజా వేమవరం

శిక్షణ తీసుకున్నా



డ్రోన్ల వాడకానికి విజయవాడ డీఆర్‌జీవో సెంటర్‌లో 10 రోజులు శిక్షణ తీసుకున్నా. బీటెక్ చదివి ఉద్యోగంలో చేరినా వ్యవసాయంపై మక్కువతో జాబ్‌కు రిజైన్ చేసి డ్రోన్ వినియోగానికి అయిదుగురు సభ్యులు గ్రూప్‌గా ఏర్పడ్డాం. డ్రోన్‌తో పురుగు మందుల పిచికారి చేయడమేగాక ఎరువులు చల్లేలా ఏర్పాటు చేసుకోవచ్చు.

– యిర్రింకి అనంత్‌రామ్, భీమవరం

ఓటరు జాబితా తయారీకి చర్యలు

కలెక్టర్ ప్రశాంతి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, అధికారులు

భీమవరం(ప్రకాశం చౌక్): ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా 2024 తయారీకి అన్ని చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పి.ప్రశాంతి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి తెలిపారు. మంగళవారం ఉదయం విజయవాడ కాన్ఫరెన్స్ హాలు పలు అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, డీఈఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ జాబితా కోసం తొలగించిన ఓటర్ల జాబితా ఇంటింటి వెరిఫికేషన్ పురోగతిపై జిల్లాల వారీగా కలెక్టర్లను అడిగారు. రాజకీయ పార్టీల సమావేశంలో లేవనెత్తిన అంశాలపై తీసుకున్న చర్యలు సకాలంలో పూర్తి చేయాలని అన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా వివరాలు వెల్లడించారు. పార్టీల నుంచి అందిన ఫిర్యాదుల వెరిఫికేషన్ పూర్తయ్యిందని తెలిపారు. ఒకే ఇంటి నెంబర్‌పై ఎక్కువ ఓట్ల నమోదు వంటివి పూర్తి స్థాయిలో పరిశీలించి ఈ నెల 15 నాటికి పూర్తి చేస్తామన్నారు. పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ ఫిజికల్ వెరిఫికేషన్ గడువులోపు పూర్తి చేస్తామని చెప్పారు. జేసీ రామ్ సుందర్ రెడ్డి, ఈఆర్వోలు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి



బాలల హక్కులపై అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాజేశ్వరి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బాలల సంరక్షణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను ప్రవేశపెట్టాయని వాటిపై బాలలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి జీ.రాజేశ్వరి సూచించారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీఆర్ఆర్ పబ్లిక్ స్కూల్‌లో బాలల సంరక్షణ, న్యాయ సహాయం అనే అంశంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేశ్వరి మాట్లాడుతూ బాలలకు కల్పించిన హక్కులను అమలు చేసే విధానంలో ఏమైనా లోపం జరిగితే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ దృష్టికి తీసుకురావాలని, బాలలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై యాజమాన్యాలు అవగాహన కల్పించాలని సూచించారు. బాలలకు ప్రాథమిక హక్కులు ప్రాథమిక విధులు, లీగల్ సర్వీసెస్ అందించే ఉచిత న్యాయ సహాయాలపై అవగాహన కల్పించారు. బాల బాలికలు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని, సత్ప్రవర్తనతో తోటి వారితో స్నేహపూర్వకంగా ఉండాలని, ప్రతి విద్యార్థి తమ భవిష్యత్తు లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని మంచి నడవడికతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో ప్యానల్ అడ్వకేట్ పీ.వెంకటేశ్వరరావు, స్కూల్ ప్రిన్సిపాల్ సాయికుమారి శంకర్, డైరెక్టర్ రాజకళా శ్రీధరి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రి బొత్సకు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీ.అశోక్ కుమార్ రెడ్డి, గెడ్డం సుధీర్‌లు వినతిపత్రం సమర్పించారు. మంగళవారం మంత్రి బొత్సని ఆయన కార్యాలయంలో కలిసి.. ఎంఈఓ–2గా నియమితులైన వారికి గత మూడు నెలల నుంచి జీతాలు అందలేదని వారికి వెంటనే జీతాలు అందేలా చూడాలన్నారు. హెచ్ఎం పోస్టు, పీడీ పోస్ట్ విత్ డ్రా అయిన ఉన్నత పాఠశాలలో కేడర్ స్ట్రెంత్ పూర్తికాక ఇప్పటికీ జీతాలు అందలేదని మంత్రి దృష్టికి తీసుకువెళ్ళామన్నారు. సర్వీసు రూల్స్ సమస్యను పరిష్కరించి జూనియర్ లెక్చరర్ పదోన్నతులు, డిప్యూటీ డీఈఓ పదోన్నతులను వెంటనే కల్పించాలని కోరామన్నారు. ఎంఈఓ– 2 జాబ్ చార్ట్ త్వరగా విడుదల చేయాలన్నారు. సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు.

నాడు–నేడు పనులు వేగంగా పూర్తి చేయాలి

భీమవరం(ప్రకాశం చౌక్): నాడు–నేడు నిధులు సకాలంలో ఖర్చు చేసి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో నాడు నేడులో పాఠశాలల్లో మౌలిక వసతులు, అదనపు గదులు, అంగన్‌వాడి సెంటర్ల నిర్మాణ పనుల పురోగతి, సంబంధిత శాఖల ఇంజనీరింగ్ అధికారులు, ఎంఈఓలతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిధులున్నా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత పనులను వెంటనే చేపట్టి నిధుల వినియోగంపై నివేదిక అందజేయాలన్నారు. పెయింటింగ్ పనులు పూర్తి కాకుండా ప్రారంభోత్సవం చేయొద్దని ఆదేశించారు. చిన్న పనులు ఉంటే పూర్తి చేసి స్థానిక ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవం చేయడానికి సిద్ధం చేయాలన్నారు. సెప్టెంబర్ 25 నుంచి పరిశీలనకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వైద్యానికి రూ.10 లక్షల సాయం



రూ.10 లక్షల ఎల్‌ఓసీ లెటర్‌ను అందజేస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చొరవతో వైద్య సాయం నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నిధుల నుంచి రూ.10 లక్షల ఎల్‌ఓసి లెటర్ మంజూరైంది. తాడేపల్లిగూడెం మండలం మారంపల్లి ఉపసర్పంచ్ సరిపల్లి చిట్టిబాబు, మాజీ సర్పంచ్ కల్లేపల్లి కృష్ణంరాజుకు బంధువైన సరిపల్లి వెంకటేశ్వరరావు కుమార్తె సరిపల్లి సుస్మిత దేవికి అత్యవసరంగా వైద్య సాయం చేయాల్సి రావడంతో ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు విన్నవించారు. తక్షణమే స్పందించిన మంత్రి కొట్టు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.10 లక్షల ఎల్‌ఓసి లెటర్‌ను మంజూరు చేశారు. వైద్యం నిమిత్తం రూ. 10 లక్షల ఎల్‌ఓసి లెటర్‌ను సరిపల్లి వెంకటేశ్వరరావుకు మంగళవారం సచివాలయంలోని కొట్టు క్యాంపు కార్యాలయం వద్ద అందచేశారు. హైదరాబాద్‌లోని అమెరికన్ అంకాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో సుస్మితాదేవికి వైద్యం అందించనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డికి, ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణకు వెంకటేశ్వరరావు కృతజ్ఞతలు తెలిపారు.

చాంపియన్‌గా ఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ జట్టు



పోటీల్లో గెలుపొందిన జిల్లా జట్లు

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పురుషుల జట్టు చాంపియన్‌గా నిలవగా, మహిళల జట్టు ద్వితీయస్థానం సాధించింది. విజయవాడ స్టెల్లా కళాశాలలో ఈ నెల 11, 12 తేదీల్లో సీనియర్ ఇంటర్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. వర్మ, మోహన్, లోకేష్‌తో కూడిన జిల్లా పురుషుల జట్టు సత్తా చాటింది. మంగళవారం సాయంత్రం ఫైనల్ పోటీల్లో పశ్చిమ జట్టు గుంటూరుతో తలపడింది. 20–15 స్కోర్ తేడాతో గుంటూరు జట్టును ఓడించి విజేతగా నిలిచింది. టాలీ అనిత, జి.నాగదేవి, టి.జ్యోతితో కూడిన మహిళల జట్టు ఫైనల్‌లో వైజాగ్‌చేతిలో ఓడి ద్వితీయ స్థానంలో నిలిచింది. విజేతలను బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు కె.కృష్ణారెడ్డి, గవ్వ శ్రీనివాసరావు, కె.మురళీకృష్ణ అభినందించారు.

ప్రతి కుటుంబానికీ ఆరోగ్య భద్రత

- ఈ నెల 15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష
- 30 నుంచి మెగా వైద్య శిబిరాలు



శ్రీరామపురంలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్



వైద్యం చేస్తున్న వైద్యురాలు డాక్టర్ ధనలక్ష్మి (ఫైల్)

భీమవరం అర్బన్: ప్రజారోగ్యానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబం సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఇప్పటికే ఆరోగ్యశ్రీలో పేదలకు 3,200కు పైగా వ్యాధులకు వైద్యం అందిస్తున్నారు. గ్రామాలలో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్లు ఏర్పాటు చేసి మెరుగైన వైద్యం అందించేందుకు పట్టణాలు, పల్లెల్లో ఇప్పటికే ఆరోగ్య సిబ్బందిని నియమించారు. రోగుల వద్దకే వెళ్లి వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని తీసుకువచ్చి వైద్యం అందిస్తున్నారు. వైద్య రంగంలో ఎన్నో విప్లవాత్మక చర్యలతో దేశమంతా రాష్ట్రం వైపు చూసేలా చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఈ నెల 15న నూతనంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనుంది. దీనిలో భాగంగా ఇంటింటా ప్రజల ఆరోగ్యంపై సర్వే చేసి వైద్య సేవలందించేలా కార్యాచరణ రూపొందిస్తారు.

వైద్య నిపుణుల పర్యవేక్షణలో.. భీమవరం మండలంలో తుందుర్రు, గొల్లవానితిప్ప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 25 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఈ నెల 30న మండలాల వారీగా మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తారు. ప్రతి శిబిరంలో ఇద్దరు డాక్టర్లు అందుబాటులో ఉంటారు. వారితో పాటు 104 వాహనంలో విధులు నిర్వహించే డాక్టర్ కూడా సేవలందిస్తారు. క్షేత్రస్థాయిలో ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఈ నెల 15 నుంచి ఇంటింటికి వెళ్లి ఆయా కుటుంబాల్లోని రోగులను పరిశీలించి వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తారు. రోగులకు చికిత్స అవసరమైతే వెంటనే ఆస్పత్రులకు పంపిస్తారు. వైద్యాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరాలు నిర్వహిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



వ్యాధిగ్రస్తులను గుర్తించి మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం. ఈ నెల 15 నుంచి ఇంటింటికి వెళ్లి ఏఎన్ఎం, వలంటీర్ సర్వే నిర్వహిస్తారు. 30 నుంచి ప్రతి మండలంలో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లో మెగా హెల్త్ క్యాంపు ఉంటుంది. ప్రతి క్యాంపులో ఇద్దరు మెడికల్ ఆఫీసర్లతో పాటు ఇద్దరు స్పెషలిస్టు వైద్యులు సేవలందిస్తారు.

– సీహెచ్ ధనలక్ష్మి, వైద్యాధికారిణి, పీహెచ్‌సీ, గొల్లవానితిప్ప

జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యాలివే..

- ఆరోగ్య శిబిరంలో రోగులను వైద్యులు పరీక్షించి మందులు అందజేస్తారు.
- అవసరమైన వారికి మెరుగైన వైద్యం కోసం వైద్య నిపుణులకు, ఆస్పత్రులకు సిఫార్సు చేస్తారు. దీర్ఘకాలిక రోగాలతో బాధపడేవారు, బాలింతలు, పిల్లలు, మధుమేహం, గుండె, క్యాన్సర్ వంటి వివిధ రోగాలున్న వారిని గుర్తించే ప్రత్యేక లక్ష్యంతో అన్ని ఇళ్లనూ సర్వే చేస్తారు.
- ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై సర్వే
- వలంటీర్లు తమ క్లస్టర్ పరిధిలోని ఇళ్లకు వెళ్లి ఏఎన్ఎం సందర్శన షెడ్యూల్‌ను తెలియజేయాలి.
- ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించాలి

మీ చిట్టి చేతులతోటే మట్టి గణపతి తయారు చేయండి ఇలా..

సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో

వినాయకుని పుట్టినరోజు ... గణేశ్ చవితి పండుగ వస్తోంది! ఈ రోజున పెద్దవాళ్లు, పెద్ద పెద్ద పందిళ్ల నిర్వాహకులూ పెద్ద పెద్ద విగ్రహాలు తయారు చేసి భారీ ఎత్తున పూజించడం మీకు తెలుసు కదా... అయితే ప్రకృతి ప్రేమికుడైన గణనాయకుడు ప్రకృతి సిద్ధమైన, సులువుగా తిరిగి ప్రకృతిలో కలిసిపోయేలా ఉండే మట్టిగణపతి విగ్రహాలను పూజించే వారికే బోలెడన్ని ఆశీస్సులు అందిస్తాడని మీకు తెలుసు కదా... మట్టి గణపతిని మీ చిట్టి చేతులతో స్వయంగా మీరే తయారు చేసి పూజలో ఉంచి, గణపతికి ఇష్టమైన పిండివంటలు ఆరగింపజేసి, మీ కోరికలన్నీ కోరండేం! సమయం ఆసన్నమైంది. 'అయ్యో! మాకు విగ్రహం తయారు చేయడం రాదే అనో, మా దగ్గర బంకమట్టి లేదు కదా... ఇప్పుడెలా' అనో దిగులు పడకండి. మట్టిగణపతి విగ్రహం తయారు చేసే విధానాన్ని మేమే మీకు నేర్పిస్తాం. ప్రతి సంవత్సరం లాగే ఇప్పుడు కూడా సాక్షి మీడియా గ్రూప్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వారి సహకారంతో మట్టి గణపతి విగ్రహాల తయారీలో మీకు శిక్షణనిచ్చేందుకు ఉచిత శిబిరాన్ని నిర్వహిస్తోంది.

ఈ నెల 16వ తేదీన జరిగే ఈ కార్యక్రమంలో 5 నుంచి 16 సంవత్సరాల లోపు గల బాలలందరూ పాల్గొనవచ్చును. దీనికి ఎటువంటి రుసుము చెల్లించనక్కరలేదు. బంకమట్టిని నిర్వాహకులే ఉచితంగా సమకూర్చుతారు. అయితే మీరు చేయాల్సిందల్లా ఏమిటంటే... దిగువ తెలిపిన నంబర్లకు ఫోన్‌చేసి మీ పేర్లను నమోదు చేసుకోవడమే! ఈ శిబిరంలో పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టిని గణనాయకుని ప్రతిమలుగా రూపొందించే విధానాన్ని నేర్పిస్తారు. మరి ఇంకెందుకు ఆలస్యం..? మీరు కూడా ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొని, మీరు తయారు చేసిన వినాయక ప్రతిమలను ఇంటికి తీసుకు వెళ్లి పూజించండి. శిక్షణకు వచ్చేవారు పాత వాటర్‌బాటిల్, పాతవస్త్రం వెంటతీసుకు రావడం మాత్రం మరచిపోవద్దేం!

అవిఘ్నమస్తు, అభీష్ట సిద్ధిరస్తు.

శిబిరం చిరునామా:

పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్, నాచువారిసెంటర్, భీమవరం-1

తేది : 16-09-2023 (శనివారం)

సమయం : ఉ. 9.30 గం.ల నుంచి మధ్యాహ్నం 12.30 గం.ల వరకు.

రిజిస్ట్రేషన్లకు సంప్రదించవలసిన ఫోన్ నంబరు : 9912440768

క్లుప్తంగా

యోగా పోటీల్లో సత్తా చాటిన 'భవన్స్' విద్యార్థులు



విద్యార్థిని అర్మిత భవానీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తాడేపల్లిగూడెం రూరల్: కర్నూలులో ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో పెదతాడేపల్లి భారతీయ విద్యాభవన్స్ విద్యార్థులు సత్తా చాటి అసోంలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజీవ్‌కుమార్ శర్మ మంగళవారం చెప్పారు. పోటీల్లో అండర్–14 నుంచి 16 బాలికల విభాగంలో అర్మిత భవానీ చౌదరి ప్రథమం, ఎస్.తస్లీమ్ ద్వితీయం, బాలుర విభాగంలో ఎస్.ఆదిత్యవర్ధన్ నాల్గవ స్థానం, అండర్–10 నుంచి 12 ఏళ్ల బాలుర విభాగంలో సీహెచ్ దీపక్‌రామ్ రెడ్డి తృతీయ స్థానాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను స్కూలు చైర్మన్ చెరుకువాడ శ్రీరంగనాథరాజు (రంగరాజు), వైస్ చైర్మన్ చెరుకువాడ నర్సింహరాజు, కమిటీ సభ్యులు గోపాలకృష్ణంరాజు, గ్రంధి సాయిబాబా వరప్రసాద్, పీఎస్ఎన్.మూర్తి, శివరామరాజు అభినందించారు.

కల్వర్టులో పడి ల్యాబ్ టెక్నీషియన్ మృతి



ప్రమాదంలో మృతి చెందిన రాజీవ్

తణుకు: తణుకు పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడిక్కడే మృతి చెందాడు. పెరవలి మండలం అజ్జరం గ్రామానికి చెందిన మర్రి రాజీవ్ (34) తణుకులోని ఒక ల్యాబరేటరీలో టెక్నీషియన్‌గా పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని తిరిగి మోటారు సైకిల్‌పై స్వగ్రామానికి వెళుతుండగా ఉండ్రాజవరం జంక్షన్ వద్ద అదుపు తప్పి కల్వర్టులో పడిపోయాడు. తీవ్ర గాయాలపాలై రాజీవ్ ఘటనా స్థలంలోనే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఉండ్రాజవరం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జరుగుతున్న క్రమంలోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. పట్టణ ఎస్సై వి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కొనసాగిన ఎస్సై దేహదారుఢ్య పరీక్షలు



అభ్యర్థిని ఎత్తును కొలుస్తున్న సిబ్బంది



ఎలక్ట్రానిక్ చిప్‌ను స్కాన్ చేస్తున్న సిబ్బంది

- మొత్తం 538 మంది మహిళ అభ్యర్థులకు అడ్మిన్ కార్డుల జారీ
- ఏలూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పరీక్షలకు 260 మంది హాజరు
- పరీక్షల నిర్వహణను పరిశీలించిన ఏలూరు రేంజ్ డీఐజీ, ఎస్పీ

ఏలూరుని పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా ఎస్సై అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు మంగళవారం కూడా కొనసాగాయి. మొత్తం 538 మంది మహిళా అభ్యర్థులు ఈ పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, 260 మంది మాత్రమే హాజరయ్యారు. వీరికి ఫిజికల్ ఎఫీషియెన్సీ పరీక్షల్లో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ తదితర పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ ఇప్పటివరకు నిర్వహించిన దేహదారుఢ్య పరీక్షలకు 4,581 మంది పురుష అభ్యర్థులు హాజరు కాగా, 3,233 మంది, 1177 మంది మహిళ అభ్యర్థులు హాజరు కాగా, 607 మంది అర్హత సాధించారని చెప్పారు. పరీక్షలను ఎస్పీ డి.మేరీ ప్రశాంతి, ఏఎస్పీ ఎంజేవీ భాస్కరరావు పరిశీలించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో 1600 మీటర్ల పరుగు పరీక్షలో పాల్గొన్న మహిళా అభ్యర్థులు



లాంగ్ జంప్ చేస్తున్న అభ్యర్థిని



అభ్యర్థినుల విద్యార్హత సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది



100 మీటర్ల పరుగులో పాల్గొన్న మహిళా అభ్యర్థులు

తణుకులో భారీ దోపిడీ

- నగల వ్యాపారి కుటుంబ సభ్యులను కట్టేసి బంగారం అపహరణ
- తణుకు నరేంద్ర సెంటర్‌లో ఘటన
- కిలో పైగా బంగారం, రూ.లక్ష నగదు దోపిడీ చేసి కారులో పరారీ

తణుకు: బంగారు నగల వ్యాపారి కుటుంబ సభ్యులను తాళ్లతో కట్టేసి.. వారిని విచక్షణారహితంగా కొట్టి కేజీ పైగా బంగారు ఆభరణాలను దోచుకెళ్లిన ఘటన మంగళవారం రాత్రి తణుకులో చోటుచేసుకుంది. బంగారంతో పాటు లక్ష రూపాయల నగదు కూడా దుండగులు దోచుకెళ్లారు. వివరాల్లోకి వెళితే.. తణుకు నరేంద్ర సెంటర్ వద్ద బంగారు నగల దుకాణాల వీధిలో రేణుక జ్యూయలరీ పేరుతో నామ్‌దేవ్ వ్యాపారం చేస్తున్నారు. షాపు మేడపైన రెండో అంతస్తులో నామ్‌దేవ్ కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. మంగళవారం సెలవు కావడంతో షాపులన్నీ మూసి ఉన్నాయి. ఇదే అదునుగా ఐదుగురు దుండగులు సుమారు 7.30 గంటల ప్రాంతంలో ముసుగులు ధరించి నేరుగా నామ్‌దేవ్ ఇంట్లోకి చొరబడ్డారు. ఆ సమయంలో ముగ్గురు పిల్లలు శ్రేయ, చైత్ర, చేతన ట్యూషన్‌కు వెళ్లగా ఇంట్లో నామ్‌దేవ్, అతని భార్య సవిత, కుమారుడు చేతన్ ఉన్నారు. దుండగులు ఇంట్లోకి చొరబడి కత్తులతో బెదిరించి తమతో పాటు తెచ్చుకున్న టేపుతో వారి కాళ్లు, చేతులు కట్టేశారు. ప్రతిఘటించిన నామ్‌దేవ్‌ను విచక్షణారహితంగా కొట్టడంతో ఆయన తీవ్ర గాయాలపాలయ్యారు. బెడ్‌రూమ్‌లో ఉన్న లాకర్ తాళాలు తీసుకుని లాకర్ తెరిచి కిలోకి పైగా తాకట్టు బంగారం, రూ.లక్ష నగదును దోచుకెళ్లారు. ఇదంతా కేవలం 15 నిమిషాల వ్యవధిలో పూర్తిచేసినట్టు బాధితులు చెబుతున్నారు. దుండగులు కారులో పరారయ్యారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దుండగులు వెళ్లిపోయిన కొద్దిసేపటికి తేరుకున్న నామ్‌దేవ్ తప్పించుకుని ఇరుగుపొరుగు వారికి సమాచారం ఇవ్వగా, వారు పోలీసులకు సమాచారం అందించారు. తాడేపల్లిగూడెం డీఎస్పీ రాజ్‌కుమార్, సీఐ ఆంజనేయులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు.



దాడిలో గాయపడిన నామ్‌దేవ్ కుటుంబ సభ్యులు

సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు

పట్టణంలోని ప్రధాన కూడలి నరేంద్ర సెంటర్‌లో భారీ దోపిడీ జరగడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. దోపిడీలో ఐదుగురు పాల్గొనగా నిందితుల ఆచూకీ కోసం పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. పరిసర ప్రాంతాల్లో సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల ఆధారంగా టోల్‌గేట్లను పోలీసులు అప్రమత్తం చేశారు. దుండగుల్లో ఒక వ్యక్తి గతంలో నామ్‌దేవ్ వద్ద పనిచేసిన సూరజ్‌కుమార్‌గా భావిస్తున్నారు. ఆ దిశగా పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు.

అక్కను కడతేర్చిన తమ్ముడు

- పాతగొడవల నేపథ్యంలో దాడి.. ఆలస్యంగా వెలుగులోకి..
- గత నెల 28న నరసింహపురంలో రాడ్డుతో కొట్టి హత్య
- విజయనగరం తీసుకువెళ్లి రహస్యంగా దహన సంస్కారాలు
- ఇంటి యజమాని ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు

భీమవరం అర్బన్: పాతకక్షల నేపథ్యంలో అక్కను ఇనుపరాడ్‌తో కొట్టి తమ్ముడు హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. విజయనగరం జిల్లా మెరక్‌ముడిదం మండలంలోని భైరిపురం గ్రామానికి చెందిన నడికూరి త్రినాథ్, సీతమ్మ దంపతులు జీవనోపాధి కోసం మండలంలోని నరసింహపురం గ్రామానికి వచ్చి సతివాడ సత్యనారాయణ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గత నెల 18న వారి కుమారుడు నడికూరి రామారావు, కుమార్తె నడికూరి మంగ (30) ఇక్కడకు వచ్చారు. అదే నెల 28న తమ్ముడు రామారావు, అక్క మంగ మధ్య పాతగొడవలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య మాటమాటా పెరిగి తమ్ముడు రామారావు అక్క మంగ తలపై ఇనుప రాడ్డుతో కొట్టాడు. దీంతో స్పృహ కోల్పోయి మృతి చెందింది. రామారావు ఇంటి యజమాని సతివాడ సత్యనారాయణతో తన అక్క కాలువలో పడి చనిపోయిందని చెప్పి అదే రోజే అంబులెన్స్‌లో విజయనగరం జిల్లా మెరక్ ముడిదం మండలంలో భైరిపురం గ్రామానికి తీసుకువెళ్లి దహన సంస్కారాలు నిర్వహించారు. ఇంటి యజమాని సతివాడ సత్యనారాయణ మరో పోర్షన్‌లో అద్దెకు ఉంటున్న వారిని మంగ మృతిపై విచారణ చేయగా ఇనుప రాడ్డుతో కొట్టి హత్య చేసినట్లు తెలియడంతో సత్యనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఏఎస్సై డి.సంజీవరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'శశి' విద్యార్థి మృతిపై విచారణ చేయాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): తూర్పుగోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలోని శశి జూనియర్ కళాశాలలో చనిపోయిన విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు ఆర్ఐఓ కార్యాలయ సూపరింటెండెంట్ సుబ్బారావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ సోమవారం చనిపోయిన విద్యార్థి మృతిపై తమకు పలు అనుమానాలు ఉన్నాయన్నారు. శశి కళాశాలలో ర్యాంకుల పేరుతో విద్యార్థుల్ని తీవ్రమైన మానసిక ఆందోళనకి గురిచేస్తారని, హాస్టల్లో ఉండే విద్యార్థులను ఉదయం 4.30 గంటలకి నిద్ర లేపి రాత్రి 11.30 గంటల వరకు చదువు పేరుతో హింసిస్తారని తెలిపారు. బోర్డు నిబంధనలకు విరుద్ధంగా అనేక సంఘటనలు ఇక్కడ జరిగినా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడం వల్లే ఒక విద్యార్థి బలవన్మరణం చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎవరైనా విద్యార్థి సెలవుపై ఇంటికెళ్లి తిరిగి కళాశాలలో అడుగుపెట్టాలంటే 30 నుంచి 50 శాతం ఫీజు చెల్లించాలనే నిబంధనలను శశి యాజమాన్యం అమలు చేస్తోందని ఆరోపించారు. దీనివల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారన్నారు. కళాశాల హాస్టల్‌కు అనుమతులు లేకపోయినా చర్యలు తీసుకోవడంలో అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారో అర్థం కావటం లేదన్నారు. హాస్టల్‌కి అనుమతులపై అధికారులు విచారణ చేయాలని కోరారు. విద్యార్థి మృతిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, అధికారులను డిమాండ్ చేశారు. నగర అధ్యక్షుడు ఎం.క్రాంతి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆర్ఐఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ఢిల్లీ వెళ్లిన తూర్పుకాపు నేతలు



భీమవరం నుంచి ఢిల్లీకి పయనమైన తూర్పుకాపు సంఘం ప్రతినిధులు

సాక్షి, భీమవరం: మూడు జిల్లాలకే పరిమితమైన బీసీ రిజర్వేషన్లను అన్ని జిల్లాలకు వర్తింపచేయాలని కోరుతూ అన్ని ప్రాంతాల తూర్పుకాపు సంఘాల ప్రతినిధులు ఢిల్లీ వెళుతున్నట్లు రాష్ట్ర ఓబీసీ సాధన కమిటీ కన్వీనర్ సరిపడకల రామారావు చెప్పారు. మంగళవారం భీమవరం నుంచి ఢిల్లీ వెళుతున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లోని తూర్పుకాపులకు ఓబీసీ రిజర్వేషన్స్ వర్తింపచేయాలని రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నర్సింహారావు చొరవతో జాతీయ బీసీ కమిషన్ రాష్ట్ర అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి బుధవారం ఢిల్లీలో పబ్లిక్ హియరింగ్ కమిటీ ఎదుట తమ వాదనలు వినిపించేందుకు వెళుతున్నామన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల నుంచి తూర్పుకాపు సంఘ ప్రతినిధులు ఢిల్లీ వస్తున్నారన్నారు. జిల్లా జాయింట్ సెక్రటరీ మెరగాని ప్రసాద్, ముల్లు నర్సింహమూర్తి, తాళ్లపూడి గాంధీ, ఎస్.శ్రీను, ఏకే నాయుడు ఉన్నారు.

ఎన్‌సీసీ జిల్లా అధ్యక్షుడిగా శ్యామ్‌బాబ్



నియామక పత్రం అందుకుంటున్న శ్యామ్‌బాబ్

భీమవరం (ప్రకాశం చౌక్): నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులుగా ఎ.శ్యామ్‌బాబ్ నియమితులయ్యారు. ఈ మేరకు నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మేడిది జాన్సన్, అధ్యక్షులు బి.జార్జ్‌ముల్లర్ మంగళవారం శ్యామ్‌బాబ్‌కు నియామక పత్రం అందజేశారు. మేడిద జాన్సన్ మాట్లాడుతూ నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ సభ్యుల సమక్షంలో శ్యామ్‌బాబ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. రాష్ట్ర కో–ఆర్డినేటర్లు జి.తీమోతిరాజు, బి.డేవిడ్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓ.మనోజ్ బాబ్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మాణిక్యాలరావు, న్యూలైఫ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ వై.జాన్‌కుమార్ పాల్గొన్నారు.

డీఏ బకాయిల చెల్లింపులకు ఆదేశాలు వచ్చాయ్



మాట్లాడుతున్న పలిశెట్టి దామోదరరావు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆర్టీసీ ఉద్యోగులకు డీఏ బకాయిల చెల్లింపులపై ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు చెప్పారు. మంగళవారం ఏలూరులోని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో ఏలూరు జిల్లా ఆర్టీసీ ఈయూ జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు కేవీ రాఘవులు అధ్యక్షతన, జిల్లా కార్యదర్శి బి.రాంబాబు ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దామోదరరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు 18 నెలల డీఏ బకాయిలు చెల్లింపుల విషయమై ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు చొరవతో యూనియన్, ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర నాయకత్వం చేసిన కృషి మేరకు ఈ ఆదేశాలు వచ్చాయన్నారు. ఉద్యోగులకు విలీనానికి ముందున్న ఆర్టీసీ రిక్రూట్‌మెంట్ రెగ్యులేషన్స్ రూల్సు ప్రకారమే అర్హతగల వారికి పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్టీసీ ఎండీతో చర్చించగా వారు సానుకూలంగా స్పందించారన్నారు. దీంతో పాత సర్వీస్ రూల్స్ ప్రకారమే త్వరలో ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వనున్నారన్నారు. రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఎండీ ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మండపాటి శంకరరావు, విజయవాడ జోన్ జోనల్ అధ్యక్షులు ఎంఎస్ రావు, జోనల్ సెక్రటరీ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ముంచెత్తిన భారీ వర్షం



తాడేపల్లిగూడెం మున్సిపల్ కార్యాలయం వద్ద రోడ్డును ముంచెత్తిన వర్షపు నీరు, మురుగునీరు



తాడేపల్లిగూడెం మసీదు సెంటర్‌లోని ఓ వీధిలో ముంపు నీటిలోనే నడిచి వెళుతున్న ఓ మహిళ



మొగల్తూరులో ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపు నీరు

తాడేపల్లిగూడెం రూరల్: జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో డ్రెయిన్లు పొంగిపొర్లగా, రోడ్లు జలమయమయ్యాయి. తాడేపల్లిగూడెంలో ఉదయం కురిసిన భారీ వర్షానికి కేఎన్ రోడ్డు, టీటీడీ కల్యాణ మండపం రోడ్డు, మున్సిపల్ కార్యాలయం, ప్రకాశం మున్సిపల్ మార్కెట్, కుమ్మర పేట, కంచర్ల ఆయుర్వేదం వీధి, శేషమహల్ వెనుక, పసర్ల చెరువు, కోతిబొమ్మ సెంటర్ ప్రాంతాల్లో రోడ్లపైకి వర్షపు నీరు చేరింది. మసీదు సెంటర్ ఎస్‌బీఐ ఏటీఎం వద్ద వీధిని వర్షం నీరు ముంచెత్తింది. కాలువలా మారి మునిగిన రోడ్డులోనే స్థానికులు రాకపోకలు సాగించారు.

మొగల్తూరులో 69.4 మి.మీ వర్షం

మొగల్తూరు: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లో పల్లపు ప్రాంతాలు నీటమునిగాయి. ఆదివారం నుంచి మంగళవారం వరకు 69.4 మిల్లీ మీటర్ల వర్ష పాతం నమోదైంది. మొగల్తూరులోని గాంధీ బొమ్మల సెంటర్, స్టేషన్ రోడ్డు, గొల్లగూడెం, మసీదు సెంటర్, కేపీపాలెంలో ఉన్నత పాఠశాల ప్రాంతంలో, పేరుపాలెం నాలుగు రోడ్ల సెంటర్, కాళీపట్నం పడమరలోని ప్రధాన రహదారులపై వర్షపు నీరు నిలిచిపోవడంతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు.

అత్యధికంగా ఆచంటలో 68 మి.మీ వర్షపాతం

సాక్షి, భీమవరం: జిల్లాలోని ఆచంటలో మంగళవారం అత్యధికంగా 68 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని సమాచారశాఖ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. పెనుగొండలో 51.2 మిల్లీమీటర్లు, పాలకొల్లులో 49.2, యలమంచిలిలో 40.2, నరసాపురంలో 39.2, మొగల్తూరులో 37.2, పోడూరులో 28, పెనుమంట్రలో 25.2, ఇరగవరంలో 18.8, అత్తిలిలో 17.4, భీమవరంలో 13.8, వీరవాసరంలో 11.2, తణుకులో 10 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వ్యాన్ పట్టివేత

ముసునూరు: కోళ్ల వ్యర్థాలను అక్రమంగా రవాణా చేస్తున్న వ్యక్తిని వాహనంతో సహా పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై ఎం.కుటుంబరావు చెప్పారు. ఏలూరు ప్రాంతంలోని చేపల చెరువులకు హైదరాబాద్ నుంచి మండలంలోని కాట్రేనిపాడు మీదుగా వెళుతున్న కోళ్ల వ్యర్థాల వాహనాన్ని సోమవారం సాయంత్రం వాహన తనిఖీల్లో భాగంగా ఆపబోగా, పోలీసులను చూసి డ్రైవర్ ఓలేటి శ్రీనాగసాయిరామ్ (24) వాహనాన్ని ఆపకుండా వెళ్లాడు. పోలీసులు వాహనాన్ని వెంబడించగా, కొంత దూరం వెళ్లిన వాహనం అదుపుతప్పి రహదారి పక్కన తిరగబడింది. కోళ్ల వ్యర్థాలతో నింపిన, ఐదు టన్నుల ప్లాస్టిక్ సంచులు కింద పడిపోయాయి. డ్రైవర్, వాహన యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ చీరకు పావు కిలో వెండి అందజేత



ముత్యాలంబాపురం ముత్యాలమ్మ వారికి వెండిని అందజేస్తున్న దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మ దేవస్థానానికి తాడేపల్లిగూడెం ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన స్వామిరెడ్డి వెంకట రక్షిత్‌రెడ్డి, యశ్వశ్రీ (యుఎస్‌ఏ) దంపతులు పావు కిలో వెండిని మంగళవారం అందజేశారు. అమ్మవారి వెండి చీర నిమిత్తం ఈ వెండిని సమర్పించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వారికి వేదాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడపా శ్రీనిబాబు – లక్ష్మీదేవి, వెంకట చలపతిబాబు (సాయి), దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్న క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్‌క్లబ్ ఆఫ్ తాడేపల్లిగూడెం సేవా కార్యక్రమంలో భాగంగా రీజియన్ చైర్‌పర్సన్ మదన్ మోహన్ అగర్వాల్ ఆధ్వర్యంలో నిడదవోలులోని చర్ల సుశీల వృద్ధాశ్రమంలో వృద్ధులకు దుప్పట్లు, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేసినట్లు పట్టణంలో మంగళవారం క్లబ్ సభ్యులు వెల్లడించారు. ఆశ్రమానికి నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో పచ్చ వెంకటేశ్వరరావు, క్లబ్ అధ్యక్షుడు వంగపండు రామ్మోహన్‌రావు, సెక్రటరీ చిన్నం జగదీష్, కోశాధికారి జీడిగుంట హరిబాబు, పి.త్రిమూర్తులు పాల్గొన్నారు.

కడియద్ద మాజీ ఎంపీటీసీ యువరాజు మృతి

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కడియద్ద గ్రామ మాజీ ఎంపీటీసీ తోట యువరాజు (85) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఈయన గత కొంత కాలంగా అస్వస్థతతో బాధపడుతున్నారు. ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం తెల్లవారు జామున తుది శ్వాస విడిచారు. ఈయనకు భార్య శిరోమణి, కుమారుడు కృష్ణమూర్తి, కుమార్తె ధనలక్ష్మి ఉన్నారు. యువరాజు భౌతిక కాయాన్ని మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, యాతం బూరయ్య, మాజీ సర్పంచ్ పరిమి వెంకటేశ్వరరావు, పాకనాటి తాతాజీ, దారపురెడ్డి శ్రీనివాస్, గట్టిం సాంబయ్య తదితరులు సందర్శించి నివాళులర్పించారు. యువరాజు మృతికి ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



తణుకు గోస్తనీ కాల్వలో లభ్యమైన దుర్గారావు మృతదేహం

తణుకు: భార్యతో ఘర్షణ పడి గోస్తనీ కాలువలో దూకి గల్లంతైన వ్యక్తి మృతదేహాన్ని పట్టణ పోలీసులు మంగళవారం గుర్తించారు. స్థానిక బండివారి వీధిలో నివాసం ఉంటున్న కీసరపు దుర్గారావు (29) తన భార్య దుర్గతో ఈనెల 10న ఘర్షణ పడి కాల్వలో దూకేశాడు. దుర్గారావు గల్లంతు కావడంతో దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయం సమీపంలో కాల్వలో దుర్గారావు మృతదేహాన్ని గుర్తించి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ ఎస్సై వి.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి మండల స్థాయి క్రీడా పోటీలు

ఆకివీడు: మండల స్థాయి క్రీడా పోటీల్ని మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో 13వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంఈఓ ఏ. రవీంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో వాలీబాల్, కోకో, కబడ్డీ, యోగా, అథ్లెటిక్, త్రోబాల్, బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్‌లలో పోటీలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోటీల్లో ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అండర్ 14, అండర్–17 రెండు టీములుగా పోటీలు జరుగుతాయని చెప్పారు. పోటీల్లో విజేతలు నియోజకవర్గంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. మండల స్థాయి క్రీడా పోటీల ఎంపిక మండల గేమ్స్ కోఆర్డినేటర్ జీ.మోహన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పల్లె ఆరోగ్యానికి భరోసా

- గ్రామాల్లో వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు
- ఫ్యామిలీ డాక్టర్ ద్వారా ఇంటింటికీ వైద్యసేవలు
- ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



ప్రభుత్వ స్కూల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

పెంటపాడు: గతంలో మెరుగైన వైద్యసేవల కోసం గ్రామీణ ప్రజలు పట్టణాలకు వెళ్లాల్సిన దుస్థితి. ఆర్థిక స్థోమత లేనివారు చికిత్సచేయించుకోలేక మంచానికే పరిమితమయ్యేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్యరంగానికి పెద్దపీట వేసింది. గ్రామీణ ప్రజలకు మెరుగైన నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను అందుబాటులోకి తీసుకు వచ్చింది. 104,108 వాహనాలు వెళ్లని గ్రామాల్లో కూడా నేడు ప్రజలకు చికిత్సలు అందుతున్నాయి. ఫ్యామిలీ డాక్టర్ వైద్య విధానం ద్వారా ఆసుపత్రికి వెళ్లలేని రోగుల ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్యసేవలు అందిస్తున్నారు. గూడెం నియోజకవర్గంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోంది. ప్రస్తుతం హెల్త్‌క్లినిక్‌ల నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. పలు చోట్ల భవనాలు ప్రారంభించి వైద్యసేవలు అందిస్తున్నారు. మిగిలిన చోట్ల అందుబాటులో ఉన్న భవనాల్లోనే వైద్యసేవలు అందిస్తున్నారు.

2500 మందికి ఒక హెల్త్ సెంటర్

గ్రామంలోని ప్రతీ 2500 మందికి ఒక హెల్త్ సెంటర్ చొప్పున నూతన భవనాలకు శ్రీకారం చుట్టారు. ఇందులో వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉంటున్నారు. హెల్త్ సెంటర్‌లో ఒక ఎంఎల్‌హెచ్‌పీతో పాటు, ఏఎన్‌ఎం, ఆశవర్కర్ ఉండి సేవలు అందిస్తారు.

ఇంటివద్దకే వైద్యం

పెంటపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అమలు చేసిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో ఇంటి వద్దకే వైద్యం అందుతోంది. ప్రతీ గ్రామాన్ని నెలలో మూడు సార్లు, వీలైతే నాలుగుసార్లు వైద్యులు సందర్శించి ఉదయం, మధ్యాహ్నం ఓపీ సేవలు అందిస్తున్నారు. ఆ తర్వాత మంచం పై ఉన్నవారు, నడలేని స్థితిలో ఉన్నవారు, ఇతర వ్యాధిగ్రస్తుల ఇంటివద్దకే వెళ్లి వైద్యం అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ చిన్నారులకు వైద్యపరీక్షలు చేసి ఆరోగ్య స్థితిగతులు రికార్డులలో నమోదు చేస్తున్నారు.

ప్రణాళిక ప్రకారం శిబిరాలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామానికి రెండు సార్లు 104 వాహనంతో వెళుతున్నాం. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామంలో ఓపీ చూస్తున్నాం. తర్వాత మంచానికే పరిమితమైన వారి ఇంటి వద్దకు వెళ్లి వైద్యం చేస్తున్నాం. 68 రకాల మందులు విలేజ్ క్లినిక్‌లో అందుబాటులో ఉంటున్నాయి. రోజు అన్ని హెల్త్ క్లినిక్‌ల నుంచి సమాచారం తీసుకొంటున్నాం. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నాం

– డాక్టర్ ఎస్వీ రమణ, ముదునూరు పీహెచ్‌సీ వైద్యాధికారి

ప్రతి నెలా మందులు ఇస్తున్నారు



నాకు తీవ్రమైన అనారోగ్యం ఉంది. నేను బయటకు తిరగలేను. వైద్యం కోసం గతంలో పట్టణాల్లోని పెద్ద ఆసుపత్రులకు వెళ్లి చికిత్సలు తీసుకొనేవాడిని ప్రస్తుతం వైద్యులు ఇంటివద్దకే వస్తున్నారు. అవసరమైతే రక్తపరీక్షలు చేస్తున్నారు. వెంటనే మందులు అందిస్తున్నారు. నెలకు రెండు సార్లు వస్తున్నారు. సరిపడా మందులు ఇస్తున్నారు.

– నాయుడు శ్రీను, పడమరవిప్పర్రు, వికలాంగుడు

గ్రామంలోనే వైద్యసేవలు



మా గ్రామంలో ప్రభుత్వం విలేజి క్లినిక్‌లు ఏర్పాటు చేసింది. దీంతో మాకు ఏ అత్యవసర వైద్యసేవలు వచ్చినా హెల్త్ క్లినిక్‌లోనే వైద్యసిబ్బంది వెంటనే పరీక్షలు చేస్తున్నారు. అంతే కాక ప్రతీనెలా 104 వాహనం ద్వారా వైద్యులు గ్రామంలోకి వస్తున్నారు. అక్కడే రక్తపరీక్షలు, మెరుగైన వైద్యపరీక్షలు నిర్వహించి అత్యవసరం అయినప్పుడు 108 వాహనంలో పట్టణాలకు తీసుకెళుతున్నారు.

– గోకా లక్ష్మి, స్థానికురాలు, విప్పర్రు

పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం



24వ వార్డులో బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్ : పౌష్టికాహారంతో ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యపడుతుందని పలువురు వక్తలు తెలిపారు. పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా స్థానిక 24వవార్డులోని 286, 230, 287 అంగన్‌వాడీ సెంటర్లలోని బాలింతలు, చిన్నారులకు, కిశోర బాలికలకు వైఎస్సార్ పౌష్టికాహార కిట్లను మంగళవారం అందచేశారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు రక్తహీనతకు గురికాకుండా జాగ్రత్తలు వహించాలన్నారు. పాలు, గుడ్లు, ఆకుకూరలు, బెల్లం, మాంసం తప్పనిసరిగా తీసుకోవాలని సూచనలు చేశారు. వీటితోపాటు ఐరన్ టాబ్లెట్లు, కాల్షియం టాబ్లెట్లు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మాసోత్సవాల్లో భాగంగా నెల రోజులపాటు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయా సెంటర్ల అంగన్‌వాడీ టీచర్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ సరస్వతి,, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విశాలాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుజాత, ప్రసన్న, సావిత్రి, ఇన్‌ఛార్జి ఎంఎస్‌కే వై పుష్ప, ఏఎన్‌ఎం జయభారతి, ఆశ వర్కర్లు విజయలక్ష్మి, బేబిరాణి,, గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్నారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి పెట్టాలి

ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్



తణుకు మండల పరిషత్ కార్యాలయంలో తేతలి 2 గ్రామ కార్యదర్శి డా.బాబును సత్కరిస్తున్న ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్, తదితరులు

తణుకు టౌన్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను గ్రామాల్లోని పేదలకు అందేలా ఎంపీటీసీ సభ్యులు, గ్రామ సర్పంచ్‌లు కృషి చేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ చెప్పారు. మంగళవారం తణుకు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిగా హాజరయ్యారు. ఈ సమావేశానికి ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీల్లో ఆప్షన్ 3 ఇళ్ల నిర్మాణాన్ని అందరూ బాధ్యతగా గుర్తించి ఏజెన్సీలను గుర్తించాలని కోరారు. ఆప్షన్ 3లో ఇప్పటికే మండలంలో 305 ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరగా నిర్మించేలా సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారుల కూడా తమ వంతు సహాయ, సహకారాలను అందించాలని కోరారు. జగనన్న కాలనీల్లో ప్రతీ ఇంటికి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకునేందుకు జాతీయ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకంలో రూ. 6 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు. గృహ నిర్మాణ మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈ వీ వెంకటరెడ్డి మాట్లాడుతూ మండలంలోని జగనన్న కాలనీలకు అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి రూ. 78 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మాట్లాడుతూ మండలంలోని వేల్పూరు, దువ్వ గ్రామాల్లో జల్ జీవన్ మీషన్ పనుల కింద 25 కిలో మీటర్ల మేర పైప్‌లైన్‌ల అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. వేల్పూరులో అసంపూర్తిగా మిగిలి పోయిన పైప్‌లైన్ పనులను వెంటనే పూర్తి చేయాలని కోఆప్షన్ సభ్యుడు కే జస్పాల్ కోరారు. మండపాక గ్రామంలో సమస్యలను పరిష్కరించాలని ఎంపీటీసీ సభ్యుడు వేల్పూరు శ్రీనివాసు కోరారు. వేల్పూరు గ్రామంలోని జగనన్న కాలనీలో పంట బోదె కారణంగా 16 స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి ఇబ్బందిగా ఉందని ఎంపీటీసీ సభ్యురాలు చుండ్రు శ్యామల సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఈసమావేశంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లాల్లోనే అత్యధిక దరఖాస్తులను అందజేసిన తేతలి 2 గ్రామ కార్యదర్శి ఎం డాక్టర్ బాబును ఎమ్మెల్సీ, ఎంపీపీ, జెడ్పీటీసీ, ఇతర అధికారులు శాలువాతో సత్కరితంచారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషుకుమారి, గారపాటి పద్మజ, ఎంపీడీవో కే కిర ణ్ కుమార్, ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తి చూపాలి



పెంటపాడు ప్రభుత్వ బేసిక్ స్కూల్లో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

పెంటపాడు: విద్యార్థులు విద్యతో పాటు, క్రీడలలో రాణించాలని పెంటపాడు ఎంఈవోలు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజులపాటు మండల స్థాయిలో జరిగే క్రీడా పోటీలను పెంటపాడు ప్రభుత్వ బేసిక్ పాఠశాలలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వర్షం కారణంగా కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, యోగా పోటీలను నిర్వహించారు. చెస్, బాల్‌బాడ్మింటన్ పోటీలను బుధవారం నిర్వహించి విజేతలను ప్రకటిస్తామని తెలిపారు. నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ ఇన్‌చార్జి డి. శేఖర్‌బాబు, పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం, పీడీ రాజేష్, మండల ఇన్‌చార్జి దిలీప్ తదితరులు క్రీడలను పర్యవేక్షించారు. వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. శ్రీనివాసరెడ్డి, ఆర్డీ కృపావరం, యోహాన్, పి. సత్యశ్రీనివాస్, వైశాలి, రవి, తదతరులు పాల్గొన్నారు. కాగా ముగింపు సమావేశం బుధవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఎంఈవోలు తెలిపారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు.

సీపీఆర్‌తోనే ప్రాణ రక్షణ



విద్యార్థులకు సీసీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్డియాక్ అరెస్ట్ సమయంలో ప్రాణాలను కాపాడేందుకు సీపీఆర్ ఎంతో ఉపయోగపడుతుందని పలువురు ట్రైనర్స్ విద్యార్థినీ, విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆత్మబంధువులం సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ అందజేశారు. చదువులో విజయం సాధించేందుకు ఏమి చేయాలి అనే అంశంపై, జ్ఞాపక శక్తి పెరిగేందుకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో వెజ్జు శ్రీనివాస్, సైకాలజిస్ట్ గంగాధర్, గౌరవాధ్యక్షుడు కడియాల పరుశురామయ్య, అధ్యక్షుడు వెజ్జు దుర్గాప్రసాద్, సెక్రటరీ శీతాల ఉషా కిరణ్, రమాకాంత్, త్రిమూర్తులు, నారాయణ, పాఠశాల హెచ్‌ఎం కె.సత్యనారాయణ, టీచర్స్, పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి సరఫరా మెరుగుదలకు రూ.21 కోట్లు



నరసాపురం మున్సిపాలిటీ కుళాయి చెరువు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో కుళాయిల ద్వారా మంచినీటి సరఫరా మెరుగుదల చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.21 కోట్లు మంజూరు చేసింది. దీనికి సంబంధించి జీవో నెంబర్ 68ని ప్రభుత్వం విడుదల చేసింది. ప్రస్తుతం మున్సిపాలిటీలో మొత్తం పైప్‌లైన్స్ వ్యవస్థ ప్రక్షాళనకు రూ.52 కోట్లతో స్పెషల్ డ్రింకింగ్ ప్రాజెక్ట్‌ను మంజూరు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన రిగిన ఈ ప్రాజెక్ట్ పనులు ఓవైపు సాగుతున్నాయి. మొదటి దశలో పట్టణంలోని 1 నుంచి 9వ వార్డుల వరకూ వార్డుల్లో పనులు మొదలు పెట్టారు. స్పెషల్ ప్రాజెక్ట్‌లో భాగంగా కొత్తగా నాలుగు ఓహెచ్‌ఆర్‌ల నిర్మాణం, ఇప్పుడున్న 40 కిలోమీటర్ల పైప్స్‌లైన్స్‌కు అదనంగా కొత్తగా దాదాపు మరో 30 కిలోమీటర్లు మేర శివారు ప్రాంతాలు కవర్ అయ్యేలా పైప్‌లైన్‌లు నిర్మిస్తున్నారు. కొత్తగా మంజూరైన రూ.21 కోట్లు నిధులతో మంచినీటి చెరువు సామర్థ్యాన్ని పెంచడం, చెరువు చుట్టూ ఫెన్సింగ్, అలాగే చెరువు వద్ద సుందరీకరణ పనులు చేపట్టాలని మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వ ఛీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు చొరవతో మంచినీటి సరఫరా మెరుగుదలకు అదనంగా రూ.21 కోట్లు మంజూరయ్యాయని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. పనులు త్వరలో చేపడతామని ఆమె వివరించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తికి తీవ్ర గాయాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలో మంగళవారం బ్రిడ్జి డౌన్ సమీపంలో రైలు ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొన్న పోలీసులు క్షతగాత్రుడుని తొలుత ఏరియా ఆసుపత్రికి, అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రావిపాడులో నేడు గడపగడపకు మన ప్రభుత్వం

పెంటపాడు: మండలంలోని రావిపాడు గ్రామంలో బుధవారం సాయంత్రం గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు గ్రామ సొసైటీ అధ్యక్షుడు దేవ వెంకటరమణ తెలిపారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొని సొసైటీ గోడౌన్‌ను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీల అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పేకాడుతున్న ఆరుగురి అరెస్ట్

భీమవరం అర్బన్: భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఎస్సై మోహన్‌రావు తన సిబ్బందితో నరసింహపురం గ్రామంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రూ.5,300 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్నకు చెబుదాం స్పందనను వినియోగించుకోండి

ఉండి: ఈ నెల 13వ తేదీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఉండి మధ్యాహ్నం 1 గంట వరకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న మండల స్థాయి జగనన్నకు చెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ పీ ప్రశాంతి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్‌సుందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత మండలస్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

14, 28 తేదీల్లో అలంపురంలో మెగా వైద్య శిబిరాలు

పెంటపాడు: అలంపురం వెంకటరమణ సేవాఛారిటీ ఆసుపత్రిలో ఈనెల 14, 28 తేదీల్లో ఉచిత మెగా వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు కొలనువాడ పెదకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రాజానగరం జీఎస్‌ఎల్ జనరల్ ఆసుపత్రి నుంచి జనరల్ వైద్యనిపుణులు, అంకాలజీ నిపుణులు, గైనకాలజీ, చిన్నపిల్లల వైద్యనిపుణులు, అదే విధంగా గుండె వ్యాధులకు సంబంధించి ఈసీజీ, 2డీ ఈకో, స్కానింగ్ పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

టీటీడీ బోర్డు సభ్యులకు దిరిశాల అభినందనలు

అత్తిలి: టీటీడీ పాలక మండలి సభ్యులుగా నియమితులైన మేకా శేషుబాబు, సుబ్బరాజులకు దిరిశాల సత్యం సేవా సమితి అధ్యక్షుడు దిరిశాల మునేశ్వరరావు అభినందనలు తెలిపారు. తనకు ఎంతో ఆప్తులైన వీరిద్దరూ టీటీడీ బోర్డు సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ, భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు.

ఆత్మహత్యల నివారణపై అవగాహనా ర్యాలీ

తణుకు టౌన్: మండలం తేతలి గ్రామంలో ఆత్మహత్య నివారణపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. జాతీయ మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా మంగళవారం తేతలి ఆరోగ్య ఉపకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో సైకాలజిస్ట్ కోట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆత్మహత్యలకు గల కారణాలు, ఆలోచనల గురించి వివరించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

15 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మాట్లాడుతున్న ఎంపీడీఓ కందుల వాణి

ఆకివీడు: ప్రజల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు మీ ఇంటికే ఆరోగ్య సిబ్బంది వచ్చే విధంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని మండల అభివృద్ధి అధికారిణి కందుల వాణి చెప్పారు. స్థానిక మండల పరిషత్ హాల్‌లో మంగళవారం ఏఎన్‌ఎంలు, ఆశ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, వర్కుల, సచివాలయ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితుల్ని తెలుసుకోవాలని సూచించారు. ప్రజల యోగక్షేమాల్ని తెలుసుకుని వారికి ఉన్న ఆరోగ్య ఇబ్బందుల్ని ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ప్రభుత్వం అందజేసిన 15 అంశాల్లో పొందుపర చాలని చెప్పారు. ఈ నెల 29వ తేదీలోపు ఇంటింటి సర్వే పూర్తి చేయాలని ఎంపీడీఓ ఆదేశించారు. ఈ నెల 30వ తేదీన మండలంలోని చినకాపవరం గ్రామ సచివాలయం వద్ద నుంచి ప్రత్యేక క్యాంపులు ప్రారంభమవుతాయన్నారు. పెదకాపవరం పీహెచ్‌సీ వైద్యురాలు మెహరున్నీస్సా బేగం మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వెళ్లి ఇంటిలో ఉన్న జనాభా వివరాలను తెలుసుకుని వారికి ఉన్న ఆరోగ్య ఇబ్బందుల్ని గుర్తించాలన్నారు. గర్భిణులు, బాలింతలు, దివ్యాంగులు, ఇతర వ్యాధిగ్రస్తుల్ని, దీర్ఘ వ్యాధిగ్రస్తుల వివరాల్ని సేకరించాలన్నారు. పీహెచ్‌సీ, సీహెచ్‌సీ పరిధిలో వైద్యంతో మెరుగుపడే వారికి స్థానికంగానే వైద్యం అందజేస్తారని చెప్పారు. చిన్నపిల్లల ఆర్థో స్పెషలిస్టులు, జనరల్, మహిళలకు సంబంధించిన వైద్యులు, ఇతర స్పెషలిస్టులను ప్రత్యేక క్యాంపుల వద్ద వైద్యం అందించేందుకు ఏర్పాట్లు చేశారన్నారు. క్యాంపుల్లో మరింత మెరుగైన వైద్యం అందజేసేందుకు ఆరోగ్యశ్రీ ఆసుపత్రులకు రోగుల్ని తరలిస్తారని వైద్యురాలు మెహరున్నీస్సా చెప్పారు. సెప్టెంబర్ 28వ తేదీ వరకూ ఆయా సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తారని ఆమె వివరించారు. ప్రతి వ్యక్తీ ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ సమావేశంలో ఎంఈఓ ఏ.రవీంద్ర, ఈఓపీఆర్‌డీ సుబ్బారావు, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆకివీడులో

స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చైర్‌పర్సన్‌జామి హైమావతి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఏఎన్‌ఎంలు, ఆశ, వలంటీర్లు, అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇచ్చారు.